# రబీ ఆశలూ గల్లంతే!

సంప్రదాయ పంట వేరుశనగ మరోసారి రైతులను కోలుకోలేని దెబ్బ తీసింది. ఖరీఫ్‌లో ప్రకృతి విపత్తులతో పంట చేతికందకపోవడం.. అరకొర దిగుబడులకు సరైన గిట్టుబాటు ధరలేకపోవడంతో నష్టాల్లో కూరుకుపోయారు. అయినా నిరాశ చెందక రబీలో గట్టెక్కుదామనుకుంటే పంటకు తెగుళ్లు ఆశించాయి. పెట్టుబడులు సైతం తిరిగివచ్చే పరిస్థితులు కనిపించకపోవడంతో రైతులు కుదేలవుతున్నారు.

- వేరుశనగకు తెగుళ్లు, ఆకుముడత, పచ్చపురుగు విజృంభణ
- పంట పెట్టుబడులు కూడా తిరిగిరావంటున్న రైతులు
- పెరిగిపోతున్న సాగు వ్యయం..


పోట్లమర్రి వద్ద వేరుశనగకు తెగుళ్లు సోకి ఆకులు పండువారిన దృశ్యం


దిగుబడి లేక పొలంలోనే వదిలేసిన పైరును చూపుతున్న రైతు

**బత్తలపల్లి:** ధర్మవరం నియోజకవర్గంలో ఇటీవల కురిసిన వర్షాలకు ధర్మవరం, బత్తలపల్లి, తాడిమర్రి, ముదిగుబ్బ మండలాల్లోని చెరువులు, కుంటల్లోకి నీరు చేరింది. దీనికి తోడు చిత్రావతి నది సైతం ప్రవహించడంతో భూగర్భజలాలు పెరిగి బోరుబావుల్లో నీటిమట్టం పెరిగింది. ఈ నేపథ్యంలో రబీ కింద నియోజకవర్గ వ్యాప్తంగా 8,057 ఎకరాలకుపైగా విస్తీర్ణంలో వేరుశనగ సాగు చేశారు. అరకొర నీరు ఉన్న రైతులు అప్పోసప్పో చేసి పంట పెట్టారు. ఇప్పటికి రెండు నెలలు గడిచింది. వాతావరణంలో మార్పుల కారణంగా పంటకు ఆకుముడత, లద్దె పురుగు, పచ్చ పురుగులు ఆశించాయి.

**పెట్టుబడులు దక్కేలా లేవు**

రబీ సీజన్‌లో బోరుబావుల కింద సాగు చేసిన వేరుశనగ పంటకు పెట్టిన పెట్టుబడులు కూడా చేతికి దక్కేలా కనిపించడంలేదు. ఎకరా సాగుకు రూ.50 వేల పైబడి ఖర్చు పెట్టినట్లు రైతులు తెలిపారు. ప్రస్తుతం పంటకు తెగుళ్లు వ్యాపించడంతో ఖరీఫ్ మాదిరే ఈసారి కూడా పెట్టుబడులు తిరిగి వచ్చే అవకాశం లేదని వాపోతున్నారు.

**ధర్మవరం నియోజకవర్గంలో రబీ సాగు వివరాలు**

| మండలం | వేరుశనగ సాగు (ఎకరాల్లో) |
|---|---|
| ధర్మవరం | 3,063 |
| తాడిమర్రి | 1,024 |
| బత్తలపల్లి | 1,120 |
| ముదిగుబ్బ | 2,850 |

**పంట నాశనమవుతోంది**



ఆకుముడత వైరస్ సోకడంతో వేరుశనగ పంట దెబ్బతింటోంది. దిగుబడి వస్తుందో లేదో అన్న అనుమానం తలెత్తుతోంది. తెగుళ్ల కారణంగా కాయ అవుటన్‌పై కూడా ప్రభావం చూపుతుంది. వ్యవసాయాధికారులు గ్రామాల్లో పర్యటించి తెగుళ్ల నివారణకు తీసుకోవాల్సిన చర్యలు వివరిస్తే బాగుంటుంది.

– బగ్గిరి రామమోహన్‌రెడ్డి, రైతు, గుమ్మళ్లకుంట, బత్తలపల్లి మండలం

**తెగుళ్లు అదుపులోకి రాలేదు**



నేను 4 ఎకరాల్లో వేరుశనగ సాగు చేశాను. పంటకు లద్దె పురుగు, ఆకుముడత తెగుళ్లు ఆశించాయి. నాలుగుసార్లు మందు పిచికారి చేసినా ఆకుముడత తగ్గడంలేదు. తెగుళ్లు వ్యాపిస్తుండడంతో దిగుబడి తగ్గే అవకాశం ఉంది. రెండు ఎకరాల్లో పంట తొలగించాను. కాయలను తొలగించేందుకు కూలీల ఖర్చులు కూడా రాదని పొలంలోనే వదిలేశాను.

– కమతం నాగేంద్ర, రైతు, పోట్లమర్రి

**రాయితీపై మందులివ్వాలి**



నేను నాలుగు ఎకరాల్లో వేరుశనగ పంట పెట్టాను. సాగు చేసి 45 రోజులు కావస్తోంది. పంటకు మందులు పిచికారి చేసినా తెగుళ్లు తగ్గడంలేదు. సాగు పెట్టుబడులు పెరుగుతున్నాయి. కానీ పంటలకు గిట్టుబాటు ధర రావడం లేదు. ప్రభుత్వం రైతులకు రాయితీ(సబ్సిడీ)పై పురుగుల మందులు అందజేస్తే బాగుంటుంది.

– వరదాల రాజారెడ్డి, రైతు, పోట్లమర్రి

## క్లుప్తంగా

### బస్సులు కేటాయించాలని ఆర్టీసీ ఎండీకి వినతి


ఎండీని కలిసిన కదిరిడిపో నాయకులు

**కదిరి అర్బన్:** పుట్టపర్తికి విచ్చేసిన ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావును కదిరి డిపో నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ నాయకులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. కదిరి డిపోకు సూపర్ లగ్జరీ, అల్ట్రా డీలక్స్, పల్లె వెలుగు బస్సులు కేటాయించాలని ఎండీకి విన్నవించారు. డిపో నుంచి సికింద్రాబాద్, బ్రహ్మంగారిమఠం, శ్రీకాళహస్తికి బస్సు సర్వీసులు నడపాలని కోరారు. ఎండీని కలిసిన వారిలో ఎన్ఎంయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎన్వీ రమణ, లక్ష్మీనారాయణ, షబ్బీర్, శ్రీరాం నాయక్ తదితరుల ఉన్నారు.

### అప్పరాచెరువులో పంటకోత ప్రయోగాలు

**బత్తలపల్లి:** అప్పరాచెరువులో మంగళవారం కంది పంటకోత ప్రయోగాలు నిర్వహించినట్లు ఏఎస్ఓ డాక్టర్ లక్ష్మీనరసింహశర్మ పేర్కొన్నారు. ఎంపీఈఓలు ఆదిలక్ష్మి, సోమశేఖర్, ఏఈఓ జగదీష్, వీఆర్ఏ నాగార్జున, అగ్రికల్చర్ ఇన్సూరెన్స్ కోఆర్డినేటర్లు మంజునాథ్, పలువురు రైతులు పాల్గొన్నారు.

### 2న ఉచిత కంటి వైద్య శిబిరం

**ధర్మవరం అర్బన్:** పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నతపాఠశాల ఆవరణలో ఫిబ్రవరి రెండో తేదీన బెంగళూరులోని నేత్రజ్యోతి కంటి ఆస్పత్రి వైద్యుల ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు యువర్స్ ఫౌండేషన్ అధ్యక్షుడు శీలా నాగేంద్ర, కార్యదర్శి జయరాం, కోశాధికారి వంకదారు మోహన్ తెలిపారు. కంటివైద్య శిబిరం పోస్టర్లను మంగళవారం స్వాతి క్లినిక్‌లో విడుదల చేశారు.

### 400 పశువులకు వైద్య సేవలు

**గాండ్లపెంట:** మండల పరిధిలోని కటారుపల్లి, జీనులకుంట గ్రామాల్లో మంగళవారం పశు వైద్య సేవలందించారు. 200 పశువులకు ముందస్తు వ్యాధినివారణ చర్యల్లో భాగంగా నట్టల నివారణ మందు, 20 గొర్రెలకు వ్యాక్సినేషన్‌ను పశువైద్యాధికారి కేశవనాయక్ ఆధ్వర్యంలో సిబ్బంది రెండు బృందాలు గా ఏర్పడి పై రెండు గ్రామాల్లో అందించారు. శిబిరంలో పశువైద్య సహాయకులు గంగాధర్, మానస, సాయికుమార్, శేఖర్‌నాయక్, నారాయణస్వామి పాల్గొన్నారు.

### బాలికల కళాశాలలో అడ్మిషన్ తీసుకోండి


విద్యార్థినులతో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్

**ధర్మవరం రూరల్:** పదో తరగతి పూర్తయిన విద్యార్థినులు ధర్మవరంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో అడ్మిషన్ తీసుకోవాలని ప్రిన్సిపాల్ లక్ష్మీకాంత్‌రెడ్డి సూచించారు. మంగళవారం గొట్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను జూనియర్ కళాశాల అధ్యాపకులు పరిశీలించారు. ఈ సందర్భంగా పదో తరగతి విద్యార్థినులకు జూనియక్ కళాశాల గురించి వివరించారు. వసతులతో పాటు అన్ని గ్రూపులకు సంబంధించిన కోర్సులు అందుబాటులో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు హాజీపీరా, పెద్దన్న, ప్రభాకర్, మల్లికార్జున, ప్రధానోపాధ్యాయులు జగన్నాధం తదితరులు పాల్గొన్నారు.

### కట్నం వేధింపులపై ఫిర్యాదు

**కదిరి అర్బన్:** అదనపు కట్నం కోసం తన భర్త వేధిస్తున్నాడని కుమ్మరవాండ్లపల్లికి చెందిన జహీరా ఫాతిమా అనే మహిళ మంగళవారం కదిరి రూరల్ అప్‌గ్రేడ్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు ఫాతిమా భర్త షౌకత్ అలీపై కేసు నమోదు చేశారు.

### ఇంటర్ విద్యార్థిని మృతి


కుటుంబ సభ్యులకు ఆర్థికసాయం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

**కనగానపల్లి:** మద్దెలచెరువు గ్రామంలో జోష్న (18) అనే ఇంటర్ విద్యార్థిని మంగళవారం అనారోగ్యంతో మృతి చెందింది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. గొర్ల నారాయణ, గీతమ్మ దంపతుల కుమార్తె జోష్న అనంతపురంలోని ఒక ప్రైవేట్ కళాశాలలో ఇంటర్మీడియట్ చదువుతోంది. సంక్రాంతి సెలవుల కోసం ఇంటికి వచ్చి అనారోగ్యానికి గురైంది. కుటుంబ సభ్యులు ఆమెను పేరూరు గ్రామానికి తీసుకెళ్లి ఓ ప్రైవేట్ డాక్టర్ వద్ద వైద్యం చేయించారు. ఆరోగ్యం కుదుటపడకపోవడంతో మెరుగైన వైద్యం కోసం అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలోనే మృతి చెందింది. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి సాయంత్రం మద్దెలచెరువుకు వెళ్లి విద్యార్థిని మృతదేహానికి నివాళులర్పించారు. తల్లిదండ్రులను ఓదార్చి ఆర్థికసాయం అందజేశారు..

## రహదారి భద్రత నియమాలు పాటించాలి


రోడ్డు భద్రత గురించి వివరిస్తున్న సీఐ ప్రభాకర్

**బత్తలపల్లి:** రహదారి భద్రత నియమాలను ప్రతి ఒక్కరూ పాటించాలని ధర్మవరం రూరల్ సీఐ ప్రభాకర్, బత్తలపల్లి ఎస్ఐ సోమశేఖర్ సూచించారు. మంగళవారం సాయంత్రం బత్తలపల్లి కూడలిలో ప్రయాణికులకు, ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 18 సంవత్సరాలలోపు మైనర్లు వాహనాలు నడిపితే ఆ వాహనాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. వాహనం నడిపినందుకు అపరాధ రుసుం వేస్తామన్నారు. ద్విచక్రవాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని స్పష్టం చేశారు. ఆటోలకు పర్మిట్, ఆర్‌సీ, ఇన్సూరెన్స్, పొల్యూషన్ వంటి పత్రాలు తప్పనిసరిగా ఉండాలని, అవి కూడా ఆటోలోనే ఉంచుకోవాలని సూచించారు. డ్రైవర్లు తమ ఆటో వెనుక డోర్ తీసి ప్రయాణికుల్ని ఎక్కించినా, డ్రైవర్ సీటు పక్కన కూర్చోబెట్టుకున్నా కేసు నమోదు చేస్తామన్నారు. ఎక్కువ మంది సెకండ్ హ్యాండ్ ఆటోలు కొనుగోలు చేసి వాడుతున్నారన్నారు. పర్మిట్ లేని వాహనాలను కొనుగోలు చేసి నడిపితే కేసులు నమోదు చేస్తామన్నారు. సరుకులు రవాణా చేసే ఆటోలలో ప్యాసింజర్లను ఎక్కించుకుంటే వాహనాలను సీజ్ చేసి అపరాధ రుసుం విధిస్తామన్నారు.

**రోడ్డు నియమాలు పాటించాలి**

**చెన్నేకొత్తపల్లి:** రహదారి నియమాలను పాటిస్తే ప్రమాదాలను నివారించవచ్చని రామగిరి సీఐ శ్రీధర్ పేర్కొన్నారు. రహదారి భద్రతా మాసోత్సవంలో భాగంగా ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థులకు మంగళవారం రహదారి నియమాలపై అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ వాహనాలు నడిపే వారు డ్రైవింగ్ లైసెన్స్ తప్పక కలిగి ఉండాలన్నారు. ద్విచక్రవాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలన్నారు. విద్యార్థులు రహదారి నియమాలను ప్రజలకు అవగాహన కల్పించి ప్రమాదాల నివారణకు తమ వంతు కృషి చేయాలన్నారు. అనంతరం చెన్నేకొత్తపల్లి ఎస్ఐ సత్యనారాయణ మాట్లాడుతూ వాహనాలను నడిపే సమయంలో తగు జాగ్రత్తలు పాటించాలన్నారు. పాఠశాల ఇన్‌చార్జ్ ప్రిన్సి పాల్ విజయలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

**ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘిస్తే చర్యలు**

**ధర్మవరం రూరల్:** ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ధర్మవరం రూరల్ సీఐ ప్రభాకర్ వాహనదారులను హెచ్చరించారు. మంగళవారం రూరల్ ఎస్ఐ శ్రీనివాసులుతో కలిసి గొట్లూరులో ట్రాఫిక్ నిబంధనలపై విద్యార్థులతో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ తప్పనిసరిగా హెల్మెట్, సీటు బెల్టు ధరించాలన్నారు. ట్రాఫిక్ నిబంధనలు, డ్రైవింగ్‌పై పూర్తి అవగాహన లేకపోవడం వల్లే ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయన్నారు. సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ డ్రైవింగ్ చేయరాదన్నారు. తల్లిదండ్రులు చిన్నారులకు వాహనాలు ఇవ్వకూడదన్నారు.

## దివ్యాంగ పింఛన్లపై సర్వే


మంచానపడ్డ పింఛన్‌దారులను పరిశీలిస్తున్న వైద్య బృందం

**బత్తలపల్లి:** దివ్యాంగ పింఛన్లపై ప్రత్యేక వైద్య బృందం మంగళవారం మండలంలోని బత్తలపల్లి, పోట్లమర్రి, అప్పరాచెరువు, సంజీవపురం, ఈదుల ముష్టూరు పంచాయతీల్లో సర్వే చేశారు. అనంతపురం మెడికల్ కళాశాల ప్రొఫెసర్ నరసింహారెడ్డి, అసిస్టెంట్ ప్రొఫెసర్ టి.చైతన్య ఆధ్వర్యంలో ఈఓఆర్డీ క్రిష్టప్ప, పీహెచ్‌సీ వైద్యాధికారి గంగిరెడ్డి, కార్యదర్శులు నారాయణస్వామి, నరేంద్ర, పవన్‌కుమార్‌రెడ్డి, సచివాలయ సిబ్బంది, ఆశా వర్కర్లు 28 మంది లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి వీరంతా మంచానికి పరిమితమయ్యారా.. పింఛన్‌కు అర్హులేనా అని ఆరా తీశారు. బుధవారం డి.చెర్లోపల్లి, నల్లబోయనపల్లి, దంపెట్ల, మాల్యవంతం, తంబాపురం, సంగాల, ఓబుళాపురం, గరిశలపల్లి పంచాయతీల్లో 27 పింఛన్ల పరిశీలన కార్యక్రమం ఉంటుందని ఎంపీడీఓ నరసింహనాయుడు తెలిపారు.

**ముదిగుబ్బ:** ఎంపీడీఓ దివాకర్ ఆధ్వర్యంలో మంగళవారం పింఛన్ల పరిశీలన కార్యక్రమం చేపట్టారు. మండలంలో 45 మందికి గాను 26 మంది పింఛన్లను పరిశీలించారు. మిగిలిన వాటిని బుధవారం పరిశీలించనున్నట్లు ఎంపీడీఓ తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్లు రాఘవేంద్రరాజు, సజ్జన్, ఇమ్రాన్ ఖాద్రీ బాషా, రాజేంద్ర, డిజిటల్ అసిస్టెంట్ అశోక్, ఏపీఎం అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## కుష్టుపై ఆందోళన అవసరం లేదు


ప్రజలకు అవగాహన కల్పిస్తున్న జిల్లా అధికారి డాక్టర్ తిప్పయ్య

**పుట్టపర్తి అర్బన్:** కుష్టు వ్యాధిపై ప్రజల్లో ఉన్న అపోహలను పూర్తిగా తొలగించుకోవాలని జిల్లా లెప్రసీ, టీబీ అండ్ ఎయిడ్స్ అధికారి డాక్టర్ తిప్పయ్య పేర్కొన్నారు. మంగళవారం పుట్టపర్తి మండలం పెడపల్లి, సుబ్బరాయనిపల్లి గ్రామాల్లో పర్యటించిన ఆయన కుష్టు వ్యాధిపై పలు సూచనలు చేస్తూ ప్రజలకు అవగాహన కల్పించారు. కుష్టు వ్యాధి సోకిన ప్రతి ఒక్కరికీ చికిత్సలు అందించాలన్నారు. ఫిబ్రవరి 2వ తేదీ వరకూ ఇంటింటి సర్వే జరుగుతుందని, ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. కుష్టు వ్యాధి లక్షణాలు ఉన్న వారిని గుర్తించి మెరుగైన వైద్య సేవలు అందించనున్నామన్నారు. కార్యక్రమంలో సీహెచ్ఓ నగేష్, సూపర్‌వైజర్ చంద్రకళ, టీబీ సూపర్ వైజర్ అబీద్ బాషా, సిబ్బంది పాల్గొన్నారు.

**తాడిమర్రి:** కుష్టుపై ఆందోళన పడొద్దని డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ సెల్వియా సాల్మన్ గ్రామస్తులకు సూచించారు. మండల కేంద్రంలో వైద్యాధికారులు మంగళవారం కుష్టు వ్యాధిగ్రస్తులను గుర్తించడానికి ఇంటింటా చేపట్టిన సర్వే ప్రక్రియను ఆమె పర్యవేక్షించారు. ఎవరికైనా చేతి వేళ్లు వంకర పోవడం, కాలి వేలి గోర్లు కరిగిపోతున్నట్లు కనిపిస్తే వెంటనే ప్రభుత్వాస్పత్రికి రావాలన్నారు. అక్కడ వారికి ప్రత్యేక చికిత్సలు అందిస్తారన్నారు. మూడేళ్ల పాటు (ఒక కోర్సు) మందులు వాడితే వ్యాధి పూర్తిగా నయమవుతుందన్నారు. కుష్టు రోగులను దూరం పెట్టకుండా వారి పట్ల ప్రేమాభిమానాలు చూపుతూ ఆదరించాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యాధికారి గోవర్ధన్ నాయుడు, పీహెచ్ఎన్ లక్ష్మీదేవి, ఎంపీహెచ్ఎస్‌లు నారాయణమ్మ, జానకిరామ్, ఏఎన్ఎం కోమలి, ఆశా కార్యకర్త ధనమ్మ పాల్గొన్నారు.

**చెన్నేకొత్తపల్లి:** కుష్టుపై ఆందోళన చెందాల్సిన పనిలేదని, వ్యాధి ప్రారంభంలోనే చికిత్స తీసుకుంటే నయమవుతుందని మండల వైద్యాధికారి డాక్టర్ రవినాయక్ అన్నారు. మేడాపురంలో ఎన్ఎస్‌గేట్ పీహెచ్‌సీ సిబ్బంది చేపట్టిన కుష్టు సర్వేను ఆయన మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ వైద్య సిబ్బందితో సర్వే వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఇంటింటి సర్వేలో శరీరంపై స్పర్శలేని మచ్చలు ఉన్నవారిని గుర్తించాలన్నారు. వ్యాధి సోకినా భయపడాల్సిన పనిలేదని ఇందుకు మెరుగైన వైద్యం చేయవచ్చునని ప్రభుత్వం నాణ్యమైన మందులను సరఫరా చేస్తోందన్నారు. అనంతరం స్థానిక హెల్త్ సబ్ సెంటర్‌లో రికార్డులను పరిశీలించారు. చిన్నారులు, గర్భిణులకు అందించే వ్యాధినిరోధక టీకాలు, ప్రసవాలపై అక్కడి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు.

## తాకితే.. నూకలు చెల్లుతాయ్


ఉప్పార్లపల్లి పాఠశాల వద్ద ట్రాన్స్‌ఫార్మర్


ఏపీ మోడల్ స్కూల్ ఆవరణలో ట్రాన్స్‌ఫార్మర్

- ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్లు

**నల్లచెరువు:** విద్యుత్ అధికారులు ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటులో ఎటువంటి రక్షణ చర్యలూ పాటించడం లేదు. ఫ్యూజ్‌బోర్డుల వద్ద ఏమాత్రం ఆదమరచినా ప్రాణాలు హరీమంటున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో జనావాసాలు, విద్యాలయాల నడుమ ట్రాన్స్‌ఫార్మర్లు ఉన్నాయి. చాలాచోట్ల తక్కువ ఎత్తులోనే వీటిని ఏర్పాటు చేశారు. వాటి వద్ద నిరంతరాయంగా విద్యుత్ ప్రసారం అవుతుంటుంది. ప్రజలు కానీ, మూగజీవాలు కానీ అటువైపు రాకుండా రక్షణ కోసం కంచె లేదా గోడలు వంటివి ఏర్పాటు చేయాలి. అయితే అధికారులు చాలాచోట్ల ఈ అంశాన్ని విస్మరించారు. ఫలితంగా తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి.

- దేవిరెడ్డిపల్లి వద్దనున్న ఏపీ మోడల్ స్కూల్ ఆవరణలో ట్రాన్స్‌ఫార్మర్ ఫ్యూజ్ బోర్డును తక్కువ ఎత్తులో ఏర్పాటు చేశారు. విద్యార్థులు ఆడుకునే సమయంలో అటువైపు ఆదమరచి వస్తే ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉందని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు.


పెద్దయల్లంపల్లి వద్ద కంప చెట్లమధ్య ట్రాన్స్‌ఫార్మర్

- ఉప్పార్లపల్లిలో మండల పరిషత్ పాఠశాల సమీపాన ట్రాన్స్‌ఫార్మర్ ఉంది. తక్కువ ఎత్తులోనే ఫ్యూజుబోర్డు ఏర్పాటు చేశారు. విద్యార్థులు, స్థానికులు ఎక్కువగా సంచరిస్తుంటారు. ప్రమాదాలేవీ జరగకముందే ట్రాన్స్‌ఫార్మర్‌ను ఎత్తులో ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని స్థానికులు కోరుతున్నారు.
- మండలంలోని చాలా గ్రామాల్లో పొలాలు, జనావాసాల మధ్య, రోడ్ల పక్కన ట్రాన్స్‌ఫార్మర్లకు ముళ్లపొదలు, చెట్ల తీగలు అల్లుకున్నాయి. గమనించకుండా దీన్ని తాకితే షాక్‌కు గురవ్వాల్సిందే.

### దున్నపోతు మాంసం కోసం ఘర్షణ

**కదిరి టౌన్:** మున్సిపల్ పరిధిలోని కుటాగుళ్ల ఎస్సీ కాలనీకి చెందిన బండ్లపల్లి కుళ్లాయప్ప, మోహన్, డబ్బా శ్రీరాములు, ఉత్తప్ప, నరసింహులు, జయ కలిసి యర్రదొడ్డి గంగమ్మ ఆలయం వద్ద మంగళవారం దున్నపోతు మాంసం విషయంలో ఘర్షణ పడ్డారు. ఈ క్రమంలో శ్రీరాములు, ఉత్తప్ప, జయ కలిసి తనపై దాడి చేసి గాయపరిచారని కుళ్లాయప్ప పట్టణ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసినట్లు సీఐ నారాయణరెడ్డి తెలిపారు.

### మెట్టినింటి వారి వేధింపులపై కేసు

**కదిరి టౌన్:** అదనపు కట్నం కోసం భర్త సురేష్‌కుమార్, అత్త అశ్వత్థమ్మ, ఆడపడచు శాంతమ్మ మానసికంగా, శారీరకంగా వేధిస్తున్నారని పట్టణంలోని జడలయ్య మఠం ఏరియాలో నివాసముంటున్న హనుమంతప్పగారి అపరంజి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు మెట్టినింటి వారిపై కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ వి.నారాయణరెడ్డి తెలిపారు.

### బాలిక అదృశ్యం

**కదిరి అర్బన్:** మండలంలోని ఓ బాలిక కనిపించడం లేదు. ఎన్నిచోట్ల వెదికినా జాడ కానరాలేదని తండ్రి రూరల్ అప్‌గ్రేడ్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు.

### గుంతలు పూడ్చేదెప్పుడు?



**ధర్మవరం:** ఇక్కడ కనిపిస్తున్నది ధర్మవరం–పుట్టపర్తి ప్రధాన రహదారి. దారి పొడవునా గుంతలు ఏర్పడడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. సంక్రాంతి పండుగలోపు గుంతలు పూడ్చుతామంటూ సీఎం చంద్రబాబు ఇచ్చిన హామీ నీటిమూటగా మారింది. పండుగకు కాదు కదా ఎప్పుడు గుంతలు పూడ్చుతారో తెలియని పరిస్థితి నెలకొంది.

### చీడపీడలు నివారిస్తే అధిక దిగుబడి


పిన్నదరిలో రైతులకు సూచనలు, సలహాలు ఇస్తున్న అధికారులు

**తాడిమర్రి:** రబీలో సాగు చేసిన వేరుశనగ పంటలో చీడపీడలను నివారించుకుంటేనే అధిక దిగుబడి వస్తుందని ఏరువాక కేంద్రం కో ఆర్డినేటర్, శాస్త్రవేత్త రామసుబ్బయ్య రైతులకు సూచించారు. 'పొలం పిలుస్తోంది' కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండలంలోని పిన్నదరి, మరవపల్లి గ్రామాల్లో వేరుశనగ పొలాలను ఏడీఏ కృష్ణయ్యతో కలసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత వాతావరణ పరిస్థితులకు వేరుశనగలో పొగాకు లద్దె పురుగు, మొదలు కుళ్లు తెగులు వ్యాప్తికి అనుకూలంగా ఉందన్నారు. వీటి నివారణకు తీసుకోవాల్సిన చర్యల గురించి రైతులకు సూచించారు. కార్యక్రమంలో ఏఓ రమాదేవి, రైతు సేవ కేంద్రం సిబ్బంది నాగేంద్ర, నిజాముద్దీన్, రైతులు పాల్గొన్నారు.

### 24న జాబ్‌మేళా

**కదిరి అర్బన్:** రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 24న పట్టణంలోని ఎస్టీఎస్ఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ స్మిత తెలిపారు. ఈ మేరకు ఆమె మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. టెన్త్ ఇంటర్, డిగ్రీ పూర్తి చేసి 35 ఏళ్లలోపు వయసు కలిగిన యువతీ యువకులు జాబ్‌మేళాకు ధ్రువపత్రాలతో హాజరుకావాలని తెలిపారు. మరిన్ని వివరాలకు 93901 76421 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

### కంటి ఆపరేషన్ల కోసం బెంగళూరుకు


బెంగళూరుకు తరలిస్తున్న రోటరీక్లబ్ సభ్యులు

**ధర్మవరం అర్బన్:** ఉచిత కంటి వైద్య శిబిరంలో శస్త్ర చికిత్సకు ఎంపికైన 57 మందిని మంగళవారం ధర్మవరం నుంచి బెంగళూరులోని శంకర్ కంటి ఆస్పత్రికి ప్రత్యేక బస్సులో తీసుకెళ్లినట్లు రోటరీక్లబ్ సభ్యులు నరేంద్రరెడ్డి, రమేష్‌బాబు, నాగభూషణం తెలిపారు. ఆపరేషన్ చేయించుకున్న తర్వాత తిరిగి వారిని ధర్మవరం తీసుకొస్తామని చెప్పారు.

### రీ సర్వే పకడ్బందీగా చేపట్టండి

**ధర్మవరం రూరల్:** భూముల రీసర్వే పకడ్బందీగా చేపట్టాలని ఆర్డీఓ మహేష్ రెవెన్యూ సిబ్బందికి సూచించారు. మంగళవారం సుబ్బరావుపేట గ్రామంలో చేపడుతున్న రీ సర్వేలో భాగంగా గ్రౌండ్ ట్రూతింగ్ వర్క్‌ను ఆయన పరిశీలించారు. సర్వేలో పొరపాట్లకు తావులేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజలు కూడా అధికారులకు సహకరించాలన్నారు. కార్యక్రమంలో సర్వేయర్లు తదితరులు పాల్గొన్నారు.

### మోడల్ పేపర్ల పంపిణీ

**పుట్టపర్తి:** కొత్తచెరువు, పుట్టపర్తి మండలాల పరిధిలోని ఉన్నత పాఠశాలల్లో పదో తరగతి చదువుతున్న 300 మంది విద్యార్థులకు యూటీఎఫ్ రూపొందించిన మోడల్ పేపర్లను పంపిణీ చేసినట్లు జిల్లా ప్రధానకార్యదర్శి లక్ష్మీనారాయణ మంగళవారం తెలిపారు. పరీక్షల్లో మంచి మార్కులు రావటానికి మోడల్ పేపర్లు బాగా ఉపయోగపడతాయన్నారు.